విజృంభిస్తున్న జ్వరాలు

- గ్రామాల్లో అపరిశుభ్రతే ప్రధాన కారణం
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కాట్రేనికోన: మండలవ్యాప్తంగా జ్వరాలు విజృంభించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుధ్యం లోపించడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని కాట్రేనికోన, కందికుప్ప, పల్లంకుర్రు, బ్రహ్మ సమేధ్యం, చిర్రయానం, దొంతికుర్రు, చేయ్యేరు, లక్ష్మివాడ, ఉప్పూడి, బంటుమిల్లి, పెనుమల్లే, కుండలేశ్వరం, నడవపల్లి, గెద్దనాపల్లి, కొప్పిగుంట పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఏ ఇంటిలో చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ప్రధానంగా టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలతో ప్రభుత్వ ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. ఈ కారణంగా కాట్రేనికోన, పల్లంకుర్రు పీహెచ్‌సీల్లో రోజూ 100కు పైబడి ఓపీ నమోదవుతోంది. ఆసుపత్రులకు వచ్చేవారిలో 90 శాతానికి పైగా విష జ్వరాలతోనే వస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవొచ్చు.

అపరిశుభ్ర పరిసరాలు

ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందాయి. ఇళ్ల పరిసరాల్లో నీటి కుండీలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, మురికిగుంటలు, ఖాళీ టైర్లు, మట్టి, ప్లాస్టిక్ పాత్రల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు వాటిలో చేరి గుడ్లు పెట్టే అవకాశం ఉంది. దోమల లార్వా వేగంగా వృద్ధి చెందుతుంది. వీటి వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. శివారు ప్రాంతాలైన పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటి మొగ, పోర, కాట్రేనికోన, పల్లంకుర్రు, కందికుప్ప తదితర గ్రామాల్లో చెత్త పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిసినా దోమల నిర్మూలన చర్యలు చేపట్టడంలో, ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అధికారులు, సిబ్బంది ఫ్రైడే–డ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవీ మొక్కుబడిగానే సాగుతున్నాయి.

ల్యాబ్‌ల ఆధునీకరణతో రోగులకు ఊరట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించారు. కాట్రేనికోన మండలంలోని పల్లంకుర్రు, కాట్రేనికోన పీహెచ్‌సీల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి రక్త పరీక్షల కోసం ల్యాబ్‌లను ఆధునీకరించారు. ప్రైవేట్ ల్యాబ్‌ల్లో సుమారు రూ.3 వేలు వరకూ ఖర్చు చేయలేని రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్‌ల్లో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి పీహెచ్‌సీలోను ఇద్దరు వైద్యులు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కారణంగా తమకు మెరుగైన సేవలు అందుతున్నాయని పలువురు రోగులు గుర్తు చేసుకుంటున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ వద్ద క్యూ కట్టిన జ్వర బాధితులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జ్వరాలు అధికంగా ఉన్నందున ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. దోమల నుంచి రక్షణ పొందాలి.

– డాక్టర్ నీలిమ, పీహెచ్‌సీ వైద్యురాలు, కాట్రేనికోన

ముస్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా కేవీఆర్ఆర్ రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో గ్రేడ్–1 కమిషనర్‌గా పనిచేసిన రాజు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు నెల రోజుల క్రితమే బదిలీ అయినా విజయవాడలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తించడం వల్ల రిలీవ్ కాలేదు. ఆయన 2019 ఫిబ్రవరి నుంచి 2020 అక్టోబర్ వరకూ అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఇప్పుడు రెండోసారి అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన ఎస్.మనోహర్ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అందరి సహకారంతో పట్టణాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా పనిచేస్తానని కొత్త కమిషనర్ రాజు అన్నారు. కమిషనర్ రాజును మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, మేనేజర్ మాచిరాజు మూర్తి తదితర విభాగాల అధికారులు, కార్యాలయ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అమలాపురం మున్సిపల్ కమిషనర్ రాజు

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

అమలాపురం టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుచరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలను తీవ్రతరం చేస్తూ కార్మికులు, రైతులు, ప్రజలను ఇబ్బంది పెడుతోందని ధ్వజమెత్తారు. నిరసనలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.కృష్ణవేణి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సఖి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామమూర్తి, పీతల రామచంద్రరావు, పాలమూరు శ్రీనివాసరావు, దైవ కృప తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో జరిగిన నిరసనలో పాల్గొన్న కార్మిక, వ్యవసాయ సంఘాల నాయకులు

త్వరలోనే మత్స్యకారులకు ఓఎన్‌జీసీ పరిహారం

యానాం: నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు చెల్లించాల్సిన ఓఎన్‌జీసీ వేట నష్టపరిహారం త్వరలోనే ఆయా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అవుతాయని సోమవారం గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆయన ఓఎన్‌జీసీ సంస్థ ఈడీ రత్నేష్‌కుమార్‌తో నష్ట పరిహారం పంపిణీ తదితర అంశాలపై సోమవారం చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే 5,289 లబ్ధిదారులకు గాను రూ.91,23,52,500 మొత్తాన్ని పుదుచ్చేరి ప్రభుత్వానికి ఓఎన్‌జీసీ సంస్థ జమ చేసిందన్నారు. యుటిలైజేషన్ సర్టిఫికెట్ సైతం త్వరితగతిన వస్తే మిగిలిన మొత్తాన్ని సైతం విడుదల చేస్తామని తెలిపారన్నారు. అదేవిధంగా 2023 ఏప్రిల్ 28 నుంచి 2024 జనవరి 28 వరకూ లబ్ధిదారులకు 9 నెలల కాలానికి రావాల్సిన రూ.54,74,11,500 ఈ వారాంతంలో విడుదల చేస్తారని తెలిపారు. దరియాలతిప్ప వద్ద గోదావరి గట్టు సొసైటీ భూముల వద్ద గండి పడిన ప్రదేశం ప్రాంతంలో ఆధునీకరణ పనులకు, చుట్టూ సోలార్ లైట్లు వేసేలా సైతం ఓఎన్‌జీసీ అధికారులు అంగీకరించారన్నారు. గతంలో ఓఎన్‌జీసీ పరిహారం జాబితా నుంచి తొలగించిన పలువురు అర్హులైన లబ్ధిదారుల పేర్లకు సైతం మానవతా దృక్పథంతో ఆమోదం తెలుపుతామని చెప్పారన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కోరుకొండ ఆనందరావు, పెద్దలు సబ్బతి శ్రీను, లోకేష్, దాసరి బుజ్జి పాల్గొన్నారు.



ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

యానాం: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు యానాం బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీ నుంచి 29 వరకూ ఐదు రోజుల పాటు హర్యానాలోని రోహటక్‌లో నిర్వహించనున్న 43వ బాలబాలికల సబ్‌జూనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పుదుచ్చేరి తరఫున ఆడనున్నారు. బాలుర విభాగంలో కర్నీడి శివసత్యకిషోర్, పాలెపు యోమంత్ గంగాధర భరత్, కట్టుంగిడి ఎస్‌వీవీ మణిదీప్, మేడా ధర్మేంద్రకుమార్, ఆకుల కస్తూరి శివప్రసాద్, బాలికల విభాగంలో గుర్రాల శ్రీవల్లి, ఆలపాటి సంజన, జువ్వల బాలశ్రీనిత్య ఎంపికయ్యారు. క్రీడాకారులను క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ శేషసుమన్, కోచ్ బొట్టా శ్రీనివాస్, రాయపురెడ్డి విజయ్ అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యానాం క్రీడాకారులు

మొక్కుబడిగా సర్వ సభ్య సమావేశం

కాట్రేనికోన: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ–1 సానబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. గత సమావేశంలో సభ్యులు ప్రతిపాదించిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ.3 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఆమోదం తెలిపారు. మండల కేంద్రం కాట్రేనికోన గేటు సెంటరులో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉన్న బస్‌షెల్టర్ శిథిలమై, ఆక్రమణకు గురైందని సభ్యులు లేవనెత్తారు. బస్‌షెల్టర్‌ను పంచాయతీ నిధులు, దాతల సహాయంతో అభివృద్ధి చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గతంలోనే పంచాయతీ తీర్మానం చేసి ఆర్టీసీకి పంపించామని సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ తెలిపారు. శిథిలమైన బస్ షెల్టరు అభివృద్ధి పనులు చేయకుండా ఒక షాపును లీజుకు టెండర్ పద్ధతిలో ఇవ్వడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఏడిది సుబ్బు, నాతి సత్యనారాయణ, మోకా చంద్ర నాగరత్నం, సర్పంచులు మల్లాడి వీరబాబ్జి, ఏడు కొండలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

తాళ్లరేవు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్‌లు రోళ్ల చక్రవర్తి, అత్తిలి బాబూరావు, వి.చిరంజీవి, ఈఓపీఆర్‌డీ ఎం.భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు



ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కేవీపీఎస్ సభ్యులు

అమలాపురం రూరల్: ఏలూరుపాడు గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు దిష్టి బొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు బొంతు రమణ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం కేసు నమోదు చేయకపోతే రఘురామ కృష్ణంరాజు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లుకు అందజేశారు. రఘురామకృష్ణంరాజుపై ఎస్పీ బి.కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గిడ్ల వెంకటేశ్వరరావు, కుంచె బాబులు, కారేం వెంకటేశ్వరరావు, కొంకి రాజామణి, నక్కా సంపత్, మచ్చా నాగయ్య, వెన్నపు దొరబాబు, మోకా శ్రీను, మెండి డేవిడ్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయాలి

అల్లవరం: అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసి అవమానించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై దాడి చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీలను వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. గోడిలంకలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ దళితులపై దాడులు చేయడం, దుర్భాషలాడడం దిగుజారుడు చర్యగా భావిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూల్ జిల్లాలో దళిత మహిళను ట్రాక్టర్‌తో గుద్ది చంపేశారన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుంచే చంద్రరావు, కటారి చంద్రరావు, శెట్టిబత్తుల బాలకృష్ణ, వడ్డి సుబ్బారావు, కొనుకు శ్రీను, బళ్ల సత్యనారాయణ, శ్రీనివాసరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు వేగవంతం చేయాలి



కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: స్వర్ణాంధ్ర–2047 స్వచ్ఛతాహి సేవ, ప్రజా వేదిక కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర–2047 డాక్యుమెంట్ జిల్లా స్థాయి ప్రణాళిక ఉండేలా ప్రజల సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నామన్నారు. వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర–2047 లక్ష్యసాధన కోసం మండల, జిల్లా స్థాయిలో అభిప్రాయ సేకరణ అనంతరం ఆయా ప్రణాళికలను క్రోడీకరించి జిల్లా స్థాయి ప్రణాళికను అక్టోబరు 15లోగా ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. డాక్యుమెంటేషన్ రూపకల్పనలో భాగంగా ఈ నెల 21 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ జరగాల్సిన కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తొలగించాలని ఆందోళన



బండారులంకలో డంపింగ్ యార్డ్ తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: మండలంలో బండారులంక 16వ వార్డు శివారు కౌశిక్ డ్రైన్ వద్ద గత పదేళ్లుగా వినియోగిస్తున్న డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. వారం రోజుల్లో డంపింగ్ యార్డ్ తొలగించకపోతే చెత్త చెదారం తీసుకొచ్చే వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ సర్పంచ్ పెనుమాల సునీతకు అందజేశారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మరిడమ్మ పానుపు



తాళ్లరేవులో మరిడమ్మ అమ్మవారి పానుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో అమ్మవారి పానుపు పూజా కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరిపించారు. అమ్మవారిని భజన వారి ఇంటి ఆడపడచుగా భావించి తాళ్లరేవు మార్కెట్ వీధిలోని భజన చంటి ఇంటి వద్దకు డప్పుల వాయిద్యాలతో తీసుకొచ్చి పానుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తాళ్లరేవు పరదేశమ్మ వీధిలోని నాయుడువారి ఇంటి కోడలుగా భావించి నాయుడు నారాయణమూర్తి, నాయుడు వీర్రాఘవరావు ఇంటి వద్ద పానుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెనుమర్తి రామకృష్ణంరాజు, అల్లూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడ్ యునైటెడ్ హాస్పటల్ సహకారంతో స్థానిక గడియారం స్తంభం సెంటరులో మంగళవారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు తెలిపారు. శిబిరంలో మధు మేహం, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్, ట్యాంకర్ అందజేత



సర్పంచ్ విజయలక్ష్మికి ట్రాక్టర్ తాళాలు అందిస్తున్న ఓఎన్‌జీసీ ఈడీ శాంతన్‌దాస్

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి అవసరాల కోసం సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ట్రాక్టర్, ట్యాంకర్లను రాజమండ్రి ఓఎన్‌జీసీ అసెట్ ఈడీ శాంతన్ దాస్ చేతుల మీదుగా సోమవారం అందించారు. సర్పంచ్ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన సచివాయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ట్రాక్టర్, ట్యాంకర్ల డాక్యుమెంట్లు, తాళాలు ఇచ్చారు. తొలుత కనక దుర్గ అమ్మవారి ఆలయంలో నూతన వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అధికారులు జి.శ్రీనివాస్, ఆర్ఎస్ రామారావు, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గొల్లవిల్లిలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

ఉప్పలగుప్తం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజవర్గ స్థాయి ఎంపిక పోటీలు గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతాయని పీడీలు కామన మధు, గొలకోటి ఫణిలు వివరించారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని పలు పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు.

కలెక్టరేట్ వద్ద మహిళా సంఘాల ధర్నా



ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేస్తున్న సంఘ సభ్యులు

అమలాపురం రూరల్: అల్లవరం ఏపీఎం షేక్ సయ్యద్‌పై చర్యలు తీసుకోవాలని అమలాపురం కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించాయి. తమను వేధింపులకు గురిచేస్తూ విధులకు హాజరు కానివ్వకుండా ఏపీఎం అడ్డుకుంటున్నారని గ్రామ మహిళ సమాఖ్య సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసన అనంతరం డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో గుడాల గ్రామ సమాఖ్య అధ్యక్షురాగోసంగి వెంకటరమణతో పాటు మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సుంకరపాలెంలో భారీ అన్నదానం

తాళ్లరేవు: గణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో సుంకరపాలెం శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో శ్రీలక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదానానికి పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు నామా గోపాలకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అప్పారి పవన్, అప్పారి యశ్వంత్, పేరూరి రోహిత్‌సాయి ఫణీంద్రలు సఫక్ తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి సఫక్ తక్రా పోటీల్లో వారు ప్రతిభ చాటారన్నారు. త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ముగ్గురు విద్యార్థులను అమలాపురం డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో–2 దుర్గాదేవి, మున్సిపల్ కమిషనర్ కేఆర్ఆర్ రాజు, ప్రధానోపాధ్యాయుడు ఘన సత్యనారాయణ అభినందించారు.

కోర్టులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టుల సముదాయంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం జరిగింది. స్థానిక మెడ్ యునైటెడ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టుల సిబ్బంది శిబిరంలో వైద్య సేవలు పొందారు. రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి, ప్రధాన కార్యదర్శి నందిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ముమ్మిడివరం: కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన మొదటి రాష్ట్ర స్థాయి కరాటే కాంపిటేషన్‌లో ముమ్మిడివరం విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో మణిదీప్, అభినవ్‌లు బంగారు పతకాలు సాధించగా, పొస్య, నదీరా వెండి పతకాలు పొందినట్లు కరాటే మాస్టర్ రారాజు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

ముమ్మిడివరం: నగర పంచాయతీ మట్టాడివారి పాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని ఇన్‌చార్జ్ ఎస్ఐ జె.భానుప్రసాద్ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.19,340 నగదు, నాలుగు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు.

అభయారణ్యాన్ని సందర్శించిన విద్యార్థులు



కోరంగి అభయారణ్యాన్ని సందర్శించిన ఫారెస్ట్ కళాశాల విద్యార్థులు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశమైన చొల్లంగిలోని కోరంగి అభయారణ్యాన్ని హైదరాబాద్‌కు చెందిన ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం సందర్శించారు. ములుగు, సిద్దిపేట కళాశాలలకు చెందిన వారికి కోరంగి వైల్డ్‌లైఫ్ రేంజ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ కోరంగి మడ అడవుల ప్రాముఖ్యతను, అభయారణ్యంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు కె.మహేష్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, ఎం.మధుబాబు పాల్గొన్నారు.

సచ్చిదానందశాస్త్రి మరణం కళా రంగానికి తీరని లోటు

అమలాపురం రూరల్: పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి మరణం హరికథా లోకానికి, కళా రంగానికి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని ఇందుపల్లిలో కోట సచ్చిదానంద శాస్త్రి సంతాప సభ శ్రీహరి సేవా యజ్ఞ సమితి గొర్తి కొండయ్య శాస్త్రి హరికథ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. 70 ఏళ్ల పాటు అవిశ్రాంతంగా హరికథలు చెప్పిన కోట సచ్చిదానంద శాస్త్రి చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పేరి విశ్వనాథ శర్మ, బ్రహ్మశ్రీ గొర్తి గోపాలకృష్ణ, బ్రహ్మశ్రీ నూకల యజ్ఞ నారాయణశర్మ, టీకే విశ్వనాథ్, శిష్ట భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటానికి మల్లాడి మద్దతివ్వలేదు

యానాం: నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలపై తాము పోరాడుతుంటే మద్దతు ఇవ్వని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేకాట క్లబ్‌కు మాత్రం వ్యతిరేకంగా ధర్నా నిర్వహించడం వెనక ఆంతర్యమేంటని యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్దాని దినేష్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ పైపులైను లీకేజీ, రీజెన్సీ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి అడ్డంకులు, డంపింగ్‌యార్డు, ఇళ్లపట్టాలు వంటి సమస్యలు అనేకం ఉన్నా వాటిని పట్టించుకోకుండా పేకాట క్లబ్‌పైనే పోరాటం చేయడం విడ్డూరమన్నారు. ఈ నెల 18న విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా బంద్ నిర్వహిస్తే మల్లాడి కృష్ణారావుకు చెందిన పెట్రోల్‌బంకు, మల్లాడి శామ్యూల్‌కు చెందిన బ్రాందీషాపు ఎందుకు తెరిచి ఉంచారని ప్రశ్నించారు. సమావేశంలో మోకా బుజ్జి, శ్రీమంతుల శ్రీధర్ పాల్గొన్నారు.